సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 17 । మార్చి । 2024




ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

జిల్లాలో ఎన్నికల కోడ్ అమలైనట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. - 8లో



పరిణయ వేడుక..

నువ్వలరేవులో సామూహిక వివాహాలు ఘనంగా జరిగాయి. అర్ధరాత్రి 1.55కు మాంగల్య ధారణ జరిగింది. - 8లో



వైఎస్సార్‌సీపీ సిద్ధం కూటమిలో యుద్ధం



- మోగిన ఎన్నికల నగారా
- అమల్లోకి ఎన్నికల నియమావళి
- ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్
- మే 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- పార్టీల్లో మొదలైన సందడి
- అభ్యర్థుల ఖరారుతో వైఎస్సార్ సీపీలో రెట్టించిన ఉత్సాహం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఎన్నికల షెడ్యూల్ రానే వచ్చింది. ఎవరి ఊహకందని విధంగా కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ తేదీని ప్రకటించింది. కోడ్ కూడా అమల్లోకి వచ్చేసింది. రాష్ట్రమంతా ఒకేసారి, 4వ విడతలో మే 13న ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ఖరారు చేయడంతో పార్టీల్లో సందడి మొదలైంది. పోలింగ్‌కు ఇంకా 58 రోజుల సమయం ఉండటంతో రాజకీయ వేడి మొదలైంది. సమయం ఎక్కువగా ఉండటంతో ప్రచారం నిర్వహించడంతో పాటు ఎన్నికల ఎత్తులు పైఎత్తుల విషయంలో పక్కాగా వెళ్లే అవకాశం రాజకీయ పార్టీలకు లభించింది.

ముందంజలో వైఎస్సార్ సీపీ..

పోలింగ్‌కు 58 రోజులు గడువు ఉంది. నామినేషన్లకు చాలా సమయం ఉంది. ఈ నేపథ్యంలో బరిలో దిగుతున్న నేతలకు టెన్షనే. మిగతా పార్టీల కన్నా వైఎస్సార్‌సీపీ ముందుంది. అభ్యర్థులందరినీ ఖరారు చేసింది. టీడీపీ విషయంలో ఇంకా స్పష్టత లేదు. నాలుగు ఎమ్మెల్యే స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయలేదు. పలాస, శ్రీకాకుళం, పాతపట్నం, ఎచ్చెర్ల నియోజక వర్గాలపై తాత్సారం చేస్తోంది. అసంతృప్తులు తిరుగుబాటు చేస్తారేమోనని భయపడుతోంది. ఈ పరిస్థితుల్లో సీట్ల ఖరారుపై ఒక నిర్ణయం తీసుకోలేని పరిస్థితిలో టీడీపీ అధిష్టానం ఉంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చేయడంతో ఆశావహులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ మాత్రం సీట్ల క్లారిటీ విషయంలో ముందంజలో ఉంది. అభ్యర్థులందరినీ ఖరారు చేయడంతో వైఎస్సార్ సీపీలో ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది. ఎవరితోనూ పొత్తుల్లేక పోవడంతో పాటు స్పష్టతతో ముందుకెళ్తుండటం వైఎస్సార్‌సీపీ నేతలకు మరింత కలిసిసొచ్చినట్టయింది. ఈ నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ రావడం తమకు సానుకూలంగా మారిందనే అభిప్రాయంతో వైఎస్సార్‌సీపీ నేతలంతా ఉన్నారు. ఇక, జనసేన, బీజేపీ విషయానికొస్తే పొత్తులో భాగంగా పోటీ చేస్తారా? చేస్తే అభ్యర్థులెవరో తెలియని పరిస్థితి నెలకుంది.

వైఎస్సార్‌సీపీ టీమ్ రెడీ

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఖరారు
- బరిలో ఉన్న వారంతా వెనుకబడిన వర్గాల వారే
- తొలిసారిగా అసెంబ్లీకి పోటీ చేస్తున్న పిరియా విజయ





సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: వెనుకబడిన వర్గాలకు వైఎస్సార్‌సీపీ పెద్ద పీట వేసింది. జిల్లాలోని ప్రధాన సామాజిక వర్గాలకు చట్టసభలకు వెళ్లేందుకు అవకాశం కల్పించింది. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు, ఎంపీ స్థానానికి బీసీలను బరిలోకి దించింది. ఆయా అభ్యర్థుల జాబితాను ఇడుపులపాయ వేదికగా సీఎం జగన్ సమక్షంలో మంత్రి ధర్మాన, ఎంపీ నందిగాం సురేష్ చేతుల మీదుగా ప్రకటించింది. అభ్యర్థులను ఖరారు చేయడంలో మిగతా పార్టీల కంటే వైఎస్సార్‌సీపీ ముందు నిలిచింది. ఖరారు చేసిన అభ్యర్థులంతా విద్యావంతులే. వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న వారిలో ఇద్దరు పీజీలు, ఐదుగురు గ్రాడ్యుయేట్లు, ఇద్దరు ఇంటర్ మీడియెట్ అర్హత గల నాయకులు ఉండటం విశేషం.

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు, పార్లమెంట్‌కు అభ్యర్థులను ఖరారు చేసింది. ప్రధాన సామాజిక వర్గాలకు చోటు కల్పించింది. వెలమ, తూర్పుకాపు, కాళింగ, మత్స్యకార సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చింది. ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి కాళింగ సామాజిక వర్గ నేత పిరియా సాయిరాజ్ భార్య పిరియా విజయను నిలబెట్టగా, పలాస నుంచి మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన సీదిరి అప్పలరాజును మరోసారి బరిలో దించింది. నరసన్నపేట నుంచి పోలినాటి వెలమ సామాజిక వర్గానికి చెందిన ధర్మాన కృష్ణదాస్‌ను, పాతపట్నం నుంచి తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన రెడ్డి శాంతిని, శ్రీకాకుళం నుంచి పోలినాటి వెలమ సామాజిక వర్గానికి చెందిన ధర్మాన ప్రసాదరావును, ఆమదాలవలస నుంచి కాళింగ సామాజిక వర్గానికి చెందిన తమ్మినేని సీతారాంను మరోసారి బరిలోకి దించింది. గతంలో శ్రీకాకుళం ఎంపీగా పోటీ చేసిన కాళింగ సామాజిక వర్గ నేత దువ్వాడ శ్రీనివాస్‌ను ఈసారి టెక్కలి ఎమ్మెల్యేగా, అప్పుడు అక్కడ ఎమ్మెల్యేగా పోటీ చేసిన పేరాడ తిలక్‌ను ఇప్పుడు శ్రీకాకుళం ఎంపీగా బరిలో నిలబెట్టారు.

బరిలో ఉన్న వారిలో సీదిరి అప్పలరాజు ఎండీ చేయగా, దువ్వాడ శ్రీనివాస్ పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. గొర్లె కిరణ్‌కుమార్, కృష్ణదాస్, రెడ్డి శాంతి, పిరియా విజయ, పేరాడ తిలక్ గ్రాడ్యుయేషన్ చేశారు. ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం ఇంటర్ వరకు చదువుకున్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున తొలిసారి అసెంబ్లీకి పోటీ చేస్తున్న నేతగా పి.విజయ నిలవనున్నారు.

క్లుప్తంగా

అమరజీవికి ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన నిస్వార్థమైన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. శనివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయాలను ప్రతి ఒక్కరూ స్మరించుకుని ముందుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ప్రేమ్ కాజల్, డీఎస్పీ ఎల్ శేషాద్రినాయుడు, ఏఓ సీహెచ్ గోపీనాథ్, సీఐలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

19న వైద్య ఉద్యోగుల గ్రీవెన్స్

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 19వ తేదీన జిల్లా కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్ఓ బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. ఉద్యోగులు తమ సమస్యలను లిఖితపూర్వకంగా తెలియజేసేందుకు వైద్యశాఖ కమిషనర్ జె.నివాస్ ఆదేశాల మేరకు ఈ గ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహిస్తున్నట్టు ఆమె తెలియజేశారు. ఆ రోజు సాయంత్రం 3 గంటల నుంచి సమస్యలను తెలియజేసుకోవాలని ఆమె ఉద్యోగులకు సూచించారు.

లోక్ అదాలత్‌లో 1782 కేసులు పరిష్కారం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 1782 కేసులు పరిష్కరించారు. ఈ అదాలత్ జిల్లా కేంద్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కోర్టుతో పాటు ఆమదాలవలస, ఇచ్ఛాపురం, కోటబొమ్మాళి, నరసన్నపేట, పలాస, పాతపట్నం, రాజాం, సోంపేట, టెక్కలి, కొత్తూరు, పొందూరు తదితర కోర్టుల్లో నిర్వహించారు. భార్యాభర్తల వివాదాలకు సంబంధించి 29 కేసులు, మోటార్ ప్రమాద కేసులు 47, ఎక్సైజ్ కేసులు 68, ఇతర కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.


నేడే పలాసలో ఎల్లమ్మ జాతర



ఎల్లమ్మతల్లి ఆలయం ముందు క్యూకాం ప్లెక్సు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఎల్లమ్మ వీధిలో వెలసిన ఆలయంలో ఆదివారం జామి ఎల్లమ్మ జాతర జరగనుంది. పురాతన తర్లాకోట జమీందార్ల కాలం నుంచి సంప్రదాయ పద్ధతిలో జాతర నిర్వహిస్తున్నారు. లక్షలాది మంది జాతరకు తరలివస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. పలాసలో పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ చారిటబుల్ ట్రస్టు వారు సుమారు ఇరవై వేల మందికి అన్నదానం చేయడానికి ఏర్పాటు చేసినట్లు పీసీఎంఏ అధ్యక్షులు మల్లా సురేష్ వెల్లడించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా పలాస ఎర్రచెరువు మీదుగా, జగన్నాథ సాగరం మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.

క్లీన్‌స్వీప్ చేస్తాం



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: రానున్న ఎన్నికల్లో జిల్లాలో శ్రీకాకుళం ఎంపీ స్థానంతో పాటు 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ అభ్యర్థులను ప్రకటించడం జరిగిందని, అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి టికెట్లు కేటాయించారని పేర్కొన్నారు. జిల్లాలో చక్కగా పనిచేసి జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. చిన్న చిన్న మనస్పర్థలు పక్కన పెట్టి విశాల దృక్పథంతో పనిచేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని బొప్పాయిపురం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పలాస నుంచి శ్రీకాకుళం వైపుగా సంజయ్ గణపతి అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా టెక్కలి మండలం బొప్పాయిపురం వద్దకు వచ్చే సరికి తన ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఆ బైక్‌పై ఉన్న జి.సిమ్మయ్య అనే వ్యక్తితో పాటుగా ఢీకొన్న గణపతికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌పై టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

- అన్ని యాజమాన్య పాఠశాలల్లో పక్కాగా అమలు
- టెన్త్ పరీక్షలు ఉన్న బడుల్లో మధ్యాహ్నం తరగతుల నిర్వహణ
- ప్రభుత్వ బడుల్లో జగనన్న గోరుముద్ద తిన్నాకే పిల్లలు ఇళ్లకు



బడిగంట

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ఒంటిపూట బడులు మొదలుకానున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటో తరగతి నుంచి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఒక్కపూట తరగతులను నిర్వహించనున్నారు. జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, మోడల్‌స్కూల్స్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, గుర్తింపు పొందిన అన్‌ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంట్‌లలో ఒంటి పూట బడులు పక్కాగా అమలు కావాల్సిందేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈనెల 18వ తేదీ నుంచి ఈ విద్యా సంవత్సరం ఆఖరి పనిదినం అనగా ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. అయితే పదో తరగతి పరీక్ష కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో పరీక్షలు జరిగే ఏడు రోజులపాటు 1 నుంచి 9 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్లాసులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఒంటిపూట బడులను నిర్వహించాల్సిందేనని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు సూచిస్తున్నారు. విద్యాశాఖ నిర్దేశించిన పలు ఆదేశాలు/సూచనలను ఆయన పాఠశాలలకు చేరవేశారు.

ఈ సూచనలు తప్పనిసరి

- పాఠశాలలో బహిరంగ ప్రదేశాల్లో/ చెట్ల కింద తరగతులు నిర్వహించరాదు.
- అన్ని పాఠశాలల్లో తగినంత తాగునీరు అందుబాటులో ఉంచాలి.
- ఎండల నేపథ్యంలో విద్యార్థుల ఉపయోగం కోసం ప్రతి పాఠశాలలో కొన్ని ఓరల్ రీ–హైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి.
- బడుల్లో సన్/హీట్ స్ట్రోక్ బారిన పడితే, వైద్య–ఆరోగ్య శాఖ సమన్వయంతో పనిచేయాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉపయోగించాలి.
- మధ్యాహ్న భోజన సమయంలో స్థానికుల సమన్వయంతో మజ్జిగ అందించాలి.
- ఎస్ఏ–2 పరీక్షల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు లేవని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది.

గోరుముద్ద తిన్నాకే.. పిల్లలు ఇంటికి

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం 'జగనన్న గోరుముద్ద' అందజేయనున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. బడుల్లో భోజనం చేసిన తర్వాతే విద్యార్థులను వారి ఇళ్లకు పంపిస్తారు. ఒంటిపూట బడుల సమయంలోనూ నిర్దేశించిన మెనూ ప్రకారమే భోజనాలు అందించాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

- జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. శనివారం ఎన్నికల ప్రకటన విడుదలైందని, మన జిల్లాలో శనివారం నుంచే కోడ్ అమలులోకి వచ్చిందని తెలిపారు. జిల్లాలో 1 పార్లమెంట్ స్థానం, 8 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయన్నారు. 2357 పోలింగ్ స్టేషన్‌లలో ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని, ఈసారి జిల్లాలో 18,63,520 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఇందులో పురుషులు 9, 23,498 మంది కాగా, స్త్రీలు 9,39,891 మంది, ఇతరులు 131 మంది ఉన్నారని తెలిపారు. ఈ ఓటర్ల జాబితాలో మహిళలు ఎక్కువగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిందని, ఈ మేరకు ఎన్నికల నియమావళిని రాజకీయ నాయకులు, వివిధ రాజకీయ పార్టీలు అనుసరించాలని కలెక్టర్ అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చుల్లో నియంత్రణ ఉంటుందని, ఆ పరిధిలో అభ్యర్థులు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఖర్చుల విషయంలో మానిటరింగ్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు గాను 24 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 24 స్టాటిక్ సర్వేలైన్స్ టీంలు, 8 వీడియో సర్వైలెన్స్ టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నామినేషన్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగే విధంగా శిక్షణ పొందిన రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఖర్చులు తెలిపేందుకు గాను ప్రత్యేక బ్యాంక్ ఖాతాను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సారి ఎన్నికల్లో 17 వేల మంది పోలింగ్ సిబ్బంది, 10వేల మంది ఫోర్సును వినియోగిస్తామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను నియమించడం లేదని, వలంటీర్లను విధుల్లోకి తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్పీ జీఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్ఓ ఎం.గణపతిరావు, అసిస్టెంట్ కలెక్టర్, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రత్యేక కంట్రోల్ రూమ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఏర్పాటు చేశారు. కొత్త కలెక్టర్ కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో 5 విభాగాలకు సంబంధించి కంట్రోల్ విభాగాలను ఏర్పాటు చేశారు. మీడియా సెల్, ఫిర్యాదులు, నిర్వహణ విభాగం, సీ–విజిల్ టీం, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్.. ఈ విభాగాలు రోజులో 24గంటలూ పనిచేయనున్నాయి.

ప్రజలకు సమాచారం, ఫిర్యాదులు, ఇతర అవసరాల కోసం టోల్ ఫ్రీ నంబరును ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. అలాగే మరికొన్ని నంబర్లను కూడా అందుబాటులో ఉంచారు.

1. టోల్ ఫ్రీ నంబరు 18004256625,
2. హెల్ప్‌లైన్ నంబర్లు: 1950 (ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 వరకూ)
3. డీసీసీ నంబర్లు: 08942 240606, 08942 240589, 08942 295084

'టెన్త్ విద్యార్థులకు ఇబ్బంది రాకూడదు'

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ జరగనున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సునాయాసంగా చేరుకునే విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల పోలీస్ అధికారులకు కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు అధ్యక్షతన ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.

పరీక్షలకు పిల్లల తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలు, కార్లపై పరీక్షా కేంద్రాలకు పంపిస్తారని, అలాంటి వారిపై ఆకస్మికంగా పోలీసులు ఆపడం, కేసులు బుక్ చేయడం వంటివి చేయరాదన్నారు. జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ప్రణాళికలతో అడుగులు వేయాలని సీతారాం సూచించారు.

బ్యానర్లు, హోర్డింగ్‌ల తొలగింపు



విగ్రహాలకు ముసుగులు వేస్తున్న అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం మధ్యాహ్నం విడుదల చేయడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుల్లోకి వచ్చింది. దీంతో జిల్లా కేంద్రంలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల, ప్రజాప్రతినిధుల హోర్డింగ్‌లు, బ్యానర్ల తొలగింపు, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడం వంటి కార్యక్రమాలను ఆర్‌డీఓ సీహెచ్ రంగయ్య శనివారం చేపట్టారు. ప్రవర్తనా నియమావళి అమలు కావడంతో 24గంటల్లోపు ప్రభుత్వ స్థలాలలో ఇలాంటి బ్యానర్‌లను తొలగించాల్సి ఉందన్నారు. 48 గంటల్లోపు ప్రైవేటు ఆస్తుల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. రాజకీయ పార్టీలు, నాయకులు నియమావళి పాటించాలని తెలిపారు.

జిల్లా కేంద్రంలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌లో కేంద్ర పోలీసు దళాలు, జిల్లా పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో కేంద్ర పోలీసు దళాలతో కలిసి ఎస్పీ జీఆర్ రాధిక ఆధ్వర్యంలోని పోలీసులు శనివారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ప్రారంభించిన ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో సుమారు 150 మంది రిజర్వ్ పోలీస్ దళాలు (ఆర్పీఎఫ్)తో కలిసి ఒకటో, రెండో పట్టణ, ట్రాఫిక్, ఏఆర్ పోలీసులు అంబేడ్కర్ కూడలి నుంచి పొట్టి శ్రీరాములు కూడలి వరకు కవాతు నిర్వహించారు. కేంద్ర దళాలకు వసతి సౌకర్యాలు కల్పించామని, లైజనింగ్ అధికారులను నియమించి ఎలాంటి అవసరం ఏర్పడినా వెంటనే తెలియజేయాలన్నారు.

సరిహద్దులో నిఘా పటిష్టం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్‌రాష్ట్ర సరిహద్దులో నిఘా పటిష్టం చేసినట్లు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఏఓబీలో దాదాపు 112 కిలోమీటర్ల మేర 52 రహదారుల ద్వారా రాకపోకలు సాగుతున్నాయని, వీటిలో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, ఇవి కాకుండా నిరంతరం పెట్రోలింగ్ టీమ్‌లు తిరుగుతున్నాయని పేర్కొన్నారు.

విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి శనివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్.జవహర్ రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ జీఆర్ రాధిక కలిసి మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే తీసుకోనున్న చర్యలను వివరించారు. వేసవి తాగునీటి ప్రణాళిక, ఎన్ఆర్ఈజీఎస్ పనులు తదితర అంశాలపై వివరణ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్ తదితర జిల్లా అధికారులు కూడా హాజరయ్యారు.

ప్రశాంత వాతావరణంలో టెన్త్ పరీక్షలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో 145 పరీక్ష కేంద్రాల్లో 30,574 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, దీనికి సంబంధించి ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రానికి సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధమని, ఈ నిబంధన ఇన్విజిలేటర్, చీఫ్ సూపరింటెండెంట్‌లకు కూడా వర్తిస్తుందని తెలిపారు. పరీక్ష విషయమై సమాచారం, ఫిర్యాదుల కోసం 9494094904 నంబరును అందుబాటులోకి ఉంచామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జి.ఆర్.రాధిక తదితరులు పాల్గొన్నారు.

'8వ వేతన సవరణ కమిటీ వెంటనే నియమించాలి'

శ్రీకాకుళం అర్బన్: తపాలా ఉద్యోగులకు 8వ వేతన సవరణ వెంటనే అమలు చేయాలని తపాలా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య పిలుపు మేరకు శుక్రవారం శ్రీకాకుళంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద తపాలా ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌పీఎస్ రద్దు చేసి ఓపీఎస్ తిరిగి అమలు చేయాలని, ఎన్ఎఫ్‌పీఈ/ఏఐపీఈయూ గ్రేడ్–సి సంఘాల గుర్తింపును తిరిగి పునరుద్ధరించాలని, కమలేష్‌చంద్ర కమిటీ సానుకూల సిఫర్సులను వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, నిలిపివేసిన 18 నెలల కరువుభత్యం బకాయిలను విడుదల చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసిన జీడీఎస్ ఉద్యోగులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా పోస్టల్ ఉద్యోగ సంగాల నాయకులు యూవీ రమణ, గణపతి, బాబూరావు, గురన్న, రామకోటి, రమేష్‌పాత్రో, సురేష్, సూరిబాబు, పోస్టల్ పెన్షనర్స్ సంఘ నాయకులు చంద్రశేఖర్, జ్యోతీశ్వరరావు, వెంకటరావు, త్రినాథ్, సూర్యనారాయణ, రమణ తదితరులు ఉన్నారు.

పర్యాటకానికి జీవం

- జిల్లాలో ఆరు చోట్ల మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిర్ణయం
- రూ.7.05కోట్ల ఉపాధి హామీ నిధులతో రహదారులు మంజూరు



పోలాకి మండలం జగతిమెట్ట వద్ద రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి చెందేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ శుక్రవారం ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎచ్చెర్ల, శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల్లో ఆరుచోట్ల రూ.7.05కోట్లతో పలు రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో పర్యాటక రంగం మెరుగుపడేందుకు ప్రధానంగా రహదారుల అవసరాన్ని గుర్తించిన అధికారుల నివేదిక ఆధారంగా ఈ నిధులు మంజూరైనట్లు సమాచారం. సంబంధిత పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఆమోద తీర్మానాలు ప్రకారం పనులు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి.

మంజూరైన రహదారులు ఇవే

- ఎచ్చెర్ల నియోజకవర్గంలో వెంకన్నగారిపేట వద్ద మెగా టూరిజం పార్క్ బీటీ రహదారి నిర్మాణం ఎచ్చెర్ల నుంచి పొన్నాడ బాలభారతిరోడ్ జంక్షన్ వరకు రూ.1కోటి రూపాయలు నిధులతో రహదారి.
- శ్రీకాకుళం నియోజకవర్గంలో పెద్దగనగళ్లపేట సముద్రతీరానికి రూ.1.5కోట్ల నిధులతో రోడ్డు.
- నరసన్నపేట నియోజకవర్గంలో అతిపురాతన బౌద్ధ స్థూపం జగతిమెట్టకు అప్రోచ్ రహదారి కోసం రూ.70లక్షలు.
- టెక్కలి నియోజకవర్గంలో విదేశీపక్షుల స్థావరం తేలినీలాపురం గ్రామానికి ఎస్ఎం రోడ్ నుంచి సీసీ రహదారి నిర్మాణానికి రూ.1.95కోట్లు.
- టెక్కలి నియోజకవర్గంలో భావనపాడు స్టేడియంకు సీసీ రహదారితోపాటు సైడ్‌వాల్ నిర్మాణానికి రూ.90లక్షలు.
- పాతపట్నం నియోజకవర్గంలో ఆధ్యాత్మిక ప్రకృతి జీవన విధాన కూర్మ గ్రామానికి అంతకాపల్లి నుంచి బీటీ రహదారి నిర్మాణం కోసం రూ.1కోటి నిధులు మంజూరయ్యాయి.

పరిణయ వేడుక



ఊరేగుతున్న పెళ్లి కొడుకు



నువ్వలరేవులో వివాహ సందడి

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవులో సామూహిక వివాహ వేడుక అపురూప రీతిలో జరిగింది. మొత్తం 62 జంటలు రాత్రి 1.55 నిమిషాల ముహూర్తంలో మాంగళ్య ధారణతో ఒక్కటయ్యాయి. అనాదిగా వస్తున్న సంప్రదాయాలను పాటిస్తూ పెళ్లి వేడుకను జరిపించారు. వరకట్నాల ప్రస్తావన లేకుండా వధువు,వధువు మేనమామ ఆర్థిక స్థోమత బట్టి నెల రోజులకు సరిపడా సారె సామాన్లు ఇచ్చారు. పెళ్లి తంతులో భాగంగా నవవధూవరులకు మంగళ స్నానాలు చేయించి వధువులకు తెల్లని చీర, నగలు, పసుపు కుంకుమ నిండైన తిలకంతో చేతికి సగం వరకు నిండుగా గాజులు ధరించి, కిరీటంతో అలంకరించారు. అలాగే నవవరులు తెల్లని లాల్చీ, ప్యాంట్, షర్ట్‌లను ధరించి వాటిపై ఎర్రని పైజామా వేసి నల్లటి కళ్లద్దాలు పెట్టుకుంటూ మెడలో నగదు దండ,కిరీటం ధరించారు. వేద మంత్రాలు నలు దిక్కులా ప్రతిధ్వనిస్తుండగా గ్రామ దేవత బృందావతి అమ్మవారి ఆశీస్సులతో అర్ధరాత్రి 1.55 నిమిషాలకు 62 జంటలు ఒక్కటయ్యాయి. వధువుల మెడలో వరులు మొదట తాళి కట్టగా.. ఆ తర్వాత వరుల మెడలో వధువులు తాళి కట్టారు.